క్లుప్తంగా

ఏబీసీ కెనాల్‌లో కంపచెట్ల తొలగింపు



ముళ్ల కంపలను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

చిప్పగిరి: చిప్పగిరి పరిధిలోని ఏబీసీ కెనాల్‌లో పేరుకుపోయిన కంపచెట్లు, పూడికను ఉపాధి హామీ కూలీలు శనివారం తొలగించారు. కెనాల్‌లో నీరు వదిలినప్పుడు కంప చెట్లు, అధిక పూడిక కారణంగా నీటి ప్రవాహం సరిగ్గా జరగడం లేదు. దీంతో ఉపాధి హామీ కింద పనులు చేసినట్లు ఏపీఓ మాదవ శంకర్ తెలిపారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

● ప్రథమ బహుమతి సాధించిన గాజులపేట వృషభాలు



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మద్దికెర: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే బండలాగుడు పోటీలు ప్రజల్లో ఐక్యమత్యాన్ని పెంచుతాయని ఎం.అగ్రహారం సర్పంచ్ విజయుడు, మండల ఉపాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, ఎడవలి మాజీ సర్పంచ్ ఆనంద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎడవలి గ్రామం సమీపంలో ఉన్న కృష్ణాపురం వద్ద కిలారి, దేశం ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభించారు. మొదటి స్థానం సాధించిన గాజులపేటకు చెందిన రమణయ్యకు రూ.30 వేలు, రెండో బహుమతి యంగనపల్లికి చెందిన వడ్డే మల్లికార్జున రూ.20 వేలు, మూడో బహుమతి జొన్నగిరికి చెందిన నెల్లూరప్పయాదవ్ రూ.10 వేలు అందుకున్నారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆర్బీకేకు చేరిన యూరియా బస్తాలు



రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉంచిన యూరియా బస్తాలు

దేవనకొండ: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం–2కు 260 నాగార్జున యూరియా బస్తాలు వచ్చినట్లు ఏఓ సురేష్ బాబు శనివారం తెలిపారు. ఒక బస్తా రూ.267గా ఉందన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని, బయట షాపుల్లో కొనడం కన్నా రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు చేయడం మంచిదని సూచించారు. ఆర్బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లిస్తే యూరియా బస్తాలు అందజేస్తామని తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామానికి చెందిన కురువ చిన్న వెంకటరాముడు, అచ్చమ్మ, మహేష్, మధుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన కురువ మల్లేష్ ఏప్రిల్ 14న చిన్న వెంకటరాముడు ఇంటి దగ్గరకు వెళ్లి తన పొలాన్ని ఎవరికైనా కౌలుకు ఇస్తాను.. మీరెవరు అడ్డుపడడానికి అని నిలదీయగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో చిన్న వెంకటరాముడు, అచ్చమ్మ, మహేష్, మధు దాడి చేశారు. బాధితుడు కర్నూలు సర్వజన ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టైఫాయిడ్‌తో బాలుడి మృతి



చాకలి కౌసిక్ (ఫైల్)

ఆలూరు: మండల కేంద్రంలోని మర్రితాత మఠం కాలనీకి చెందిన చాకలి చంద్రశేఖర్, చాకలి నరసమ్మ దంపతుల కుమారుడు చాకలి కౌసిక్ (5) టైఫాయిడ్‌తో శుక్రవారం మృతిచెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కౌసిక్ అకాల మరణంతో మఠం కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముగిసిన రంగస్వామి ఉత్సవాలు

ఆలూరు: మండలంలోని కాత్రికి గ్రామంలో రంగస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. అర్చకుడు విష్ణుశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ హరిశ్చంద్రా రెడ్డి, పాలకవర్గ కమిటీ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పత్తికొండ: భక్తాంజనేయుడిని దర్శించుకుంటున్న భక్తులు



మద్దికెర: రథోత్సవంలో భక్తులు



జొన్నగిరి అభయాంజనేయస్వామి



కటారుకొండ ఆంజనేయస్వామి

హనుమాన్ జయంతి వేడుకలు

● ఆంజనేయస్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన దేవాలయాలు ● స్వామివారికి విశేష పూజలు

కృష్ణగిరి: కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. వెల్దుర్తి జాతీయ రహదారిలో ఉన్న అంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వెల్దుర్తి సహకార సొసైటీ చైర్మన్ వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం హనుమాన్ చాలీసాను పఠించారు. భక్తులకు అన్నదానం చేశారు. కృష్ణగిరి మండలంలోని పెనుమాడ, టి.గోకులపాడు, చుంచుఎర్రగుడి, కటారుకొండ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

➡ ఆస్పరి: మండలంలోని ఆస్పరి, హలిగేర, బిణిగేర, చిన్నహోతూరు గ్రామాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగించారు.

➡ హొళగుంద: మండలంలోని హనుమాన్ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. జై శ్రీరామ్.. శ్రీఆంజనేయం నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అగ్రహార అంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం, భజన కార్యక్రమాలు జరిగాయి.

➡ మద్దికెర: మండలంలోని మద్దికెర, హంప, ఎం .అగ్రహారం, పెరవలి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

➡ తుగ్గలి: మండలంలోని తుగ్గలి, పగిడిరాయి, జొన్నగిరి తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు క్యూకట్టారు.. పగిడిరాయిలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కుటుంబ సభ్యులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర కనుల పండువగా సాగింది.

➡ పత్తికొండ రూరల్: మర్రోబావి సమీపంలోని ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే పాతపేటలోని పెద్దాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

➡ హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి, బాపురం, గూళ్యం తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. క్షేత్రగుడి ఆంజనేయ స్వామిని బియ్యంతో సుందరంగా అలంకరించారు. హనుమాన్‌చాలీసా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

➡ మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని అలంకరించి అభిషేక పూజలు చేశారు.

➡ దేవనకొండ: మండలంలోని కరివేముల, తెర్నెకల్, కప్పట్రాళ్ల, వెలమకూరు తదితర గ్రామాల్లో జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో హనుమాన్ చాలీషా పఠించారు. దేవనకొండలో రథోత్సవం నిర్వహించారు.



తుగ్గలి: పగిడిరాయిలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



మద్దికెరలో..



హాలహర్విలో..



పగిడిరాయిలో హనుమాన్ శోభాయాత్ర



ఆస్పరి: హలిగేరలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



దేవనకొండ: ఆంజనేయస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు



హొళగుందలో..

టీబీ డ్యామ్‌కు 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



హొస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యామ్(ఫైల్)

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట వద్దనున్న తుంగభద్ర రిజర్వాయర్ (టీబీ డ్యాం)కు 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో జీరో ఉండగా ఎగువ భాగంలో కురిసిన వర్షాలకు శనివారం డ్యామ్‌లోకి నీరు వచ్చి చేరుతోంది. జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరందించే తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద రైతులు 2023 రబీ వరకు రెండు పంటలను పండించారు. ఈసారి ఖరీఫ్‌కు మాత్రమే నీరందాయి. డ్యామ్‌లో ఇన్‌ఫ్లో మొదలు కావడంతో రైతులు మళ్లీ తుంగభద్ర డ్యామ్ వైపు ఆశగా చూస్తున్నారు. సకాలంలో డ్యామ్ నిండితే జూలై మొదటి, రెండో వారంలో ఎల్లెల్సీకి నీటిని వదులుతారు. శనివారం టీబీ డ్యామ్‌లో 1633 అడుగులకు గాను 1577.40 అడుగులు, 105.788 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను 3,338 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో 25 క్యూసెక్కులుండగా 360 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. గతేడాది ఇదే సమయానికి 1580.62 అడుగుల వద్ద 4.780 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మొదలైన పింఛన్ కష్టాలు



పింఛన్ కోసం బ్యాంకు వద్ద బారులు తీరిన వృద్ధులు

హాలహర్వి: వృద్ధులకు పింఛన్ కష్టాలు కొనసాగుతున్నాయి. మే నెలలో బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయిన వారికి జూన్‌లో కూడా జమ కావడంతో వృద్ధులు, వికలాంగులు బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. ఓ వైపు సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి పింఛన్‌దారులు బ్యాంకుల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు ఇంటికి వచ్చి మరీ పింఛన్ ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని నిట్రవట్టికి చెందిన పింఛన్ దారురాలు మాళమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు వద్ద గంటల తరబడి నిల్చొని పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

భక్తిశ్రద్ధలతో సుంకులమ్మ అవ్వకు పూజలు



విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

తుగ్గలి: మండల పరిధిలోని రాంపల్లి సమీపంలో వెలసిన నేరెడుజర్ల సుంకులమ్మ అవ్వ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి యోగి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వ్యాపకాలతో అశాంతి జీవనం

మద్దికెర: మానవులు యాంత్రిక జీవనం చేస్తూ లేనిపోని వ్యాపకాలతో అశాంతి జీవనం సాగిస్తున్నారని వెంకటదాసు అన్నారు. శనివారం స్థానిక శ్రీసద్గురు గౌరయ్య స్వామివారి అన్నపూర్ణ అతివర్ణ ఆశ్రమంలో గౌరయ్యస్వామి 39వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి గురుపూజ, భగవద్గీత పారాయణం చేశారు. అనంతరం పలువురు మఠాధిపతులు మాట్లాడుతూ.. ఆత్మజ్ఞానం కావాలంటే అజ్ఞానం విడనాడాలన్నారు. ఉత్తేజం కావాలంటే గురుసన్నిధికి చేరాలన్నారు. సేవే పరమావధిగా జీవించాలన్నారు. అనంతరం హనుమాన్ జయంతి సందర్భంగా ఆశ్రమంలో ఆంజనేయ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



సద్గురు గౌరయ్య స్వామి

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాల్సిందే



మాట్లాడుతున్న దేవనకొండ తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి

ఆలూరు: ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాల్సిందేనని నియోజకవర్గ ఆర్‌ఓ డి.రామునాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఇండోర్ ఆడిటోరియంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఏఆర్‌ఓ చంద్రశేఖర్, తహసీల్దార్లు పద్మజ, ఈరమ్మ, ప్రసాద్‌రాజ్, బాలు పాల్గొన్నారు.

పెరిగిన వేతనం.. ఉపాధికి ఊతం

● రోజువారీ కూలీ రూ.300
● గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు
● నియోజకవర్గంలో 68,016 జాబ్‌కార్డులు

ఆలూరు రూరల్: వలసల నివారణతో పాటు గ్రామీణుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఉపాధి హామీ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ పథకం కింద చెల్లించే వేతనం రూ.300 పెంచడంతో కూలీలకు మరింత మేలు చేకూరుతోంది. గ్రామాల్లో గతంలో కంటే ఎక్కువగా ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఆలూరు నియోజకవర్గంలో 68,016 జాబ్‌కార్డులు ఉన్నాయి. 1,62,250 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఇందులో 1,10,00 మంది పనికి వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

పనిని బట్టి వేతనం

రోజువారీ రూ.250 ఉండే ఉపాధి వేతనాన్ని రూ.300 వరకు పెంచారు. చేసిన పనిని బట్టి వేతనం చెల్లిస్తున్నారు. పెరిగిన వేతనంతో ఉపాధి కూలీల్లో సంతోషం కనిపిస్తోంది. గతంలో కంటే ఇప్పుడు పనులకు వచ్చే వారి సంఖ్య కూడా పెరిగింది.

గ్రామాల్లో అభివృద్ధి

ఉపాధి హామీ పథకం ద్వారా సొంతూరులోనే పనులు చేసుకునే అవకాశం లభిస్తోంది. దీంతో పాటు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు సైతం మెరుగుపడుతున్నాయి. చెరువుల్లో పూడికతీత, పంట కాలువల్లో పూడికతీత, రైతుల పొలాల్లో నీటి కుంటల తవ్వకం తదితర పనులు చేస్తున్నారు.



ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో సూచనలు చేస్తున్న అధికారులు



ఆలూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జాబ్ కార్డు కలిగిన వారందరికీ పని



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు కలిగి ఉన్నవారందరికీ పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు ఇచ్చాం. పెరిగిన వేతనంతో కూలీల సంఖ్య పెరుగుతోంది. పంట కాలువల్లో పూడికతీత, చెరువుల్లో పూడికతీత, ఇంకుడు గుంతల తవ్వకంతో పాటు పొలాల్లో గట్లు వేయడం, పంట కుంటలు తవ్వడం వంటి పనులు కల్పిస్తున్నాం. అలాగే పని ప్రదేశంలో కూలీలకు అన్ని వసతులు కల్పిస్తున్నాం.

–నరేంద్ర కుమార్, ఉపాధి హామీ పీఓ, ఆలూరు

పదవీ విరమణ సన్మానం



ఏఓ దంపతులను సన్మానిస్తున్న ఆర్డీఓ

పత్తికొండ రూరల్: పత్తికొండలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగభూషణం శనివారం పదవీ విరమణ పొందారు. ఆర్డీఓ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ నీలపు రామలక్ష్మి, రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, కృష్ణగిరి డిప్యూటీ తహసీల్దార్ విష్ణుప్రసాద్, వీఆర్‌ఓలు శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఆవేశాలకు లోనై ఇబ్బందులు తెచ్చుకోవద్దు



మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ

ఆస్పరి: ఎన్నికల ఫలితాల రోజు ఆవేశాలకు లోనై అనర్థాలు కొని తెచ్చుకోవద్దని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం ఆస్పరి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని.. అన్ని పార్టీల నాయకులు సంయమనం పాటించాలన్నారు. గ్రామాల్లో అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఐక్యమత్యంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక్కసారి ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడి కేసు నమోదైతే జీవితాంతం ఎన్నికల వచ్చినప్పుడల్లా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. పత్తికొండ డివిజన్‌లో 3వేల మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ప్రవర్తనలో మార్పు రాకపోతే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎలాంటి వారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

పత్తికొండ రూరల్: ఎన్నికల కౌంటింగ్ ముగిసి ఫలితాలు వెలువడిన తరువాత ఎక్కడా గొడవలు, ఘర్షణలకు తావు లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పత్తికొండ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడా గొడవలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. 144సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఎక్కడా గుంపులుగా ఉండరాదని, బైక్‌ల సైరన్‌లు తీసివేసి అధిక స్పీడుతో వెళ్లి ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడా గొడవలకు తావులేకుండా సజావుగా కొనసాగేందుకు అదనపు బలగాలతో పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ మురళీ మోహన్ పాల్గొన్నారు.